
సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం। 19। మార్చి। 2023



వ్యాధులతో జీవాలు మృతి

అనంతగిరి మండలం పందిరిమామిడిలో కొద్దిరోజులుగా వింత వ్యాధులతో పశువులు మృత్యుపడుతున్నాయి. 8లో



హరిత శోభ

డుంబ్రిగుడ: మండు వేసవిలోనూ హరిత శోభ నెలకొంది. రబీలో గిరి రైతులు చేపట్టిన వరి పైరు పచ్చదనంతో చూపరులను ఆకట్టుకుంటోంది.



అర్జీపై కలెక్టర్ స్పందన

స్పందనలో అందిన అర్జీపై కలెక్టర్ సుమిత్ కుమార్ స్పందించారు. మినుములూరులో విద్యుత్‌లైన్లను పరిశీలించారు. 8లో

న్యూస్‌రీల్

వైఎస్సార్ సంపూర్ణ ప్లస్‌తో తల్లీబిడ్డలకు మేలు

అసెంబ్లీలో ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

సాక్షి, పాడేరు: గిరిజనుల సంక్షేమానికి బడ్జెట్‌లో పెద్దపీట వేయడమే కాకుండా వైఎస్సార్ సంపూర్ణ ప్లస్ పథకం ద్వారా గిరిజన ప్రాంతాల్లో తల్లీబిడ్డల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కృషి చేయడం ఎంతో సంతోషంగా ఉందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. అసెంబ్లీలో శనివారం ఆమె మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, శిశువులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో పౌష్టికాహారం అందించే విధంగా వైఎస్సార్ సంపూర్ణ ప్లస్ దోహదపడుతోందన్నారు. దీని వల్ల వారిలో పౌష్టికాహార సమస్య తగ్గిందన్నారు. అంగన్‌వాడీ వ్యవస్థలో గత ప్రభుత్వంలో నాలుగు వేల పోస్టులు మాత్రమే ఉండేవని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 12,123 పోస్టుల భర్తీ శుభపరిణామమన్నారు. గత టీడీపీ ప్రభుత్వం అంగన్‌వాడీ వ్యవస్థ పట్ల తీవ్ర నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయింపుల ప్రకారం మారుమూల గ్రామాల్లో అదనంగా మినీ అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరు చేయడంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి కోరారు.

ఆర్థిక బలోపేతానికి కృషి



ఐటీడీఏ పీవోను కలిసిన మహేంద్ర

రంపచోడవరం: గిరిజనులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని హైపర్ ఇంటర్నేషనల్ సీఈవో (యూఎస్‌ఏ) మహేంద్ర అన్నారు. అడ్డతీగల, గంగవరం, రంపచోడవరం మండలాల్లో గిరిజనులకు 467 కోళ్ల షెడ్డుల నిర్మాణాన్ని గ్రామీణ వికాస కేంద్రంతో కలిసి సంయుక్తంగా చేపట్టినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరేను కలిశారు. చెలకవీధి గ్రామంలో నాలుగు కోళ్ల షెడ్లను ప్రారంభించారు. అలాగే సవర్లవాడలో యూవీ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. గ్రామస్తులలో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆసియా వైస్ ప్రెసిడెంట్ రీనాసోవి, బెన్నికుమార్, ప్రాజెక్టు డైరెక్టర్ బాలచిన్నపరెడ్డి, సెర్ప్ పీడీ మురళీ, ఏపీడీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలకు పీఈటీ చిన్నమ్మి ఎంపిక



జి.మాడుగుల: కేరళ రాజధాని తిరువనంతపురం సెంట్రల్ స్టేడియంలో ఈ నెల 22 నుంచి 26వరకు జరిగే ఆలిండియా సివిల్ సర్వీసెస్ మహిళల వాలీబాల్ పోటీలకు మండలానికి చెందిన పీఈటీ చిన్నమ్మి ఎంపికయ్యారు. ఈమేరకు రాష్ట్ర స్పోర్ట్స్ గేమ్స్ విభాగం కార్యదర్శి డాక్టర్ పోలా భాస్కర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. చిన్నమ్మి జి.మాడుగుల గాంధీనగర్‌లోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత బాలికల పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్నారు.

గిరి పుత్రులకు.. అమ్మ భాషలోనే బోధన

గిరి విద్యార్థులకు వారి మాతృభాషలో తప్ప తెలుగు, ఇతర భాషలపై అంతగా పట్టు ఉండదు. అందువల్ల ఇతర భాషల్లో బోధన వారికి కొంత ఇబ్బందికరంగా ఉంటోంది. ఈ సమస్యను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం వారికి మాతృభాషలో బోధన అందించేందుకు నిర్ణయించింది. ఈ మేరకు విస్తృత ఏర్పాట్లు చేసింది.

- ఉపాధ్యాయులకు బ్యాచ్‌ల వారీగా శిక్షణ
- ఒకటి నుంచి ఐదు తరగతులకు మెటీరియల్ పంపిణీ
- మంచి ఫలితాలు వస్తాయని ఆశిస్తున్న విద్యాశాఖ



అమ్మ భాషలో బోధిస్తున్న ఉపాధ్యాయిని



మాతృభాష బోధనపై శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు



గిరిజన భాషలో ఉన్న పదాలు

చింతూరు: కేంజాతి, తిరియాటి (వినండి, మాట్లాడండి), సదవాటి(చదవండి), రాసాటి(రాయండి), కూడికేకు (కూడిక), తీసివేతాకు(తీసివేత), బెబ్బోటి (ఎంత పరిమాణం), యవ్వ, అయ్య (అమ్మా, నాన్న), దాదా(అన్న), యక్క(అక్క) వంటి పదాలు ఇకపై గిరిజన ప్రాంతాల్లోని పాఠశాలల్లో వినబడనున్నాయి. గిరిజనులు మాట్లాడే భాషకు లిపి లేకపోయినా గిరిజన విద్యార్థులకు వారి మాతృభాషలోనే తప్ప తెలుగు, ఇతర భాషలపై అంతగా పట్టు ఉండదు. ఈ సమస్యను అధిగమించేందుకు గిరి విద్యార్థులకు మాతృభాషలోనే బోధించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వాళ్ల భాషలో వాడుక పదాలను తెలుగు భాషలో రూపొందించింది.

సర్వే ఆధారంగా..

ప్రాథమిక పాఠశాలల్లో గిరిజన విద్యార్థుల అభ్యసన స్థాయిని పెంచడంతో పాటు వారి భాష, సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగు కాకుండా కాపాడాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. గిరిజన ప్రాంతాల్లో వున్న విద్యార్థులు తెలుగుభాషను నేర్చుకోవడంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులు సర్వేలో గుర్తించారు. తెలుగుభాషను వారి మాతృభాషలో (గిరిజన భాష) సులువుగా నేర్పించడానికి పాఠ్య పుస్తకాలను రూపొందించారు. తద్వారా గిరిజన విద్యార్థులు తమ మాతృభాషలోనే ఓనమాలు ప్రారంభించి ఇతర భాషలపై పట్టు సాధించేందుకు మాతృభాష బోధన సాధనంగా ఉపయోగపడనుంది.

గిరి భాషలోనే పుస్తకాలు

ఒకటి నుంచి ఐదో తరగతి గిరిజన విద్యార్థుల కోసం ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ప్రారంభించింది. వారి అవసరాలకు అనుగుణంగా తెలుగు, గణితం, పరిసరాల విజ్ఞానం పాఠ్య పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌ను గిరిజన భాషలోనే రూపొందించి ఆయా పాఠశాలలకు పంపిణీ చేశారు. గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ట్రైబల్ కల్చర్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ మిషన్ (టీఎస్సార్ అండ్ టీఎం) కింద ఎన్‌జీజీ ఫైర్ అనే స్వచ్ఛంద సంస్థతో ఎంవోయూ కుదుర్చుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులకు మాతృభాష బోధనపై శిక్షణ ఇస్తున్నారు.

అల్లూరి జిల్లాలో

జిల్లాలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 2,464 ప్రాథమిక పాఠశాలలుండగా సుమారు 90 వేలమంది విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారు. మాతృభాష బోధనకు గాను ప్రస్తుతం పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలోని ఉపాధ్యాయులకు బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇస్తున్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల్లో కొండ, కువి, ఆదివాసీ ఒడియా, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల్లో కోయభాష వాడుకలో ఉంది. ప్రస్తుతం రెగ్యులర్ ఉపాధ్యాయులు మాత్రమే మాతృభాషలో బోధిస్తుండగా వీరికి సహాయంగా వలంటీర్లను నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

నాణ్యమైన విద్య

గిరిజన విద్యార్థులకు మాతృభాషలో బోధన ద్వారా నాణ్యమైన విద్య అందుతుంది. మాతృభాష బోధనకు చింతూరు ఐటీడీఏ పరిధిలో 40 మంది సిబ్బంది కావాలని నివేదిక పంపించాం.
– కంచర్ల సుజాత, ఏపీవో, ఐటీడీఏ, చింతూరు

ఉపాధ్యాయులకు శిక్షణ

పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలోని పాఠశాలల్లో ఒకటి నుంచి 5 తరగతి వరకు మాతృభాషలో విద్యాబోధనకు చర్యలుచేపట్టాం. ఇందుకోసం ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నాం.
– ఎస్‌కే సలీంబాషా, జిల్లా విద్యాశాఖాధికారి

మంచి నిర్ణయం



మాతృభాషలో బోధనపై ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది. ప్రాథమిక స్థాయిలో గిరిజన విద్యార్థులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. – పూజారి సంధ్య, ఉపాధ్యాయిన, ఎర్రంపేట, చింతూరు మండలం

కోయభాషలో బోధన అవసరం



కొత్తగా పాఠశాలలకు వెళ్లే మా పిల్లలకు మా సొంత కోయభాషలో బోధన ఎంతో అవసరం. ఒక్కసారిగా ఇతర భాషలు నేర్చుకోవాలంటే పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. – మడివి సుబ్బమ్మ, గిరిజన విద్యార్థిని తల్లి, చింతూరు

సులువుగా అర్థమవుతోంది



కోయభాషలో పాఠాలు చెబుతుంటే మాకు సులువుగా అర్థమవుతున్నాయి. కోయభాషలో చెప్పడంతో పాటు వాటిని తెలుగులో కూడా విడమరిచి అర్థమయ్యేలా చెబుతున్నారు. – మడివి తన్విత, గిరిజన విద్యార్థిని, మూడో తరగతి, చింతూరు

పకడ్బందీగా టెన్త్ పరీక్షల నిర్వహణ

జిల్లా విద్యాశాఖాధికారి సలీమ్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో సలీమ్ బాషా

రంపచోడవరం: పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌కే సలీమ్‌బాషా ఆదేశించారు. టెన్త్ పరీక్షల నిర్వహణకు సంబంధించి శనివారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో చింతూరు, రంపచోడవరం పరిధిలోని సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో పలు సూచనలు చేశారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్ష కేంద్రాలను నో సెల్‌ఫోన్ జోన్‌గా ప్రకటించాలని, సెల్‌ఫోను ఉండటానికి అనుమతి లేదని చెప్పారు. పరీక్షల నిర్వహణపై కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా డీసీఈబీ కార్యదర్శి ఎం వెంకట్రావు టెన్త్ పరీక్షల నిర్వహణపై సీఎస్‌డీవోలకు శిక్షణ ఇచ్చారు. ఖాళీ జవాబు పత్రాలు, బార్ కోడ్ హోమ్ వర్క్ షీట్లు అందజేశారు. ఈ ఏడాది రెండు డివిజన్‌ల పరిధిలో 24 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 4257 మంది విద్యార్థులు రాస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎస్‌సీ ఎగ్జామ్స్ సెంటర్ అసిస్టెంట్ కమిషనర్ వి రాజశేఖర్, ఎంఈవోలు కేవీవీ సత్యనారాయణదొర, వై మల్లేశ్వరరావు, వీవీ లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మారేడుమిల్లి: పురుగు మందు తాగి శనివారం ఓ గిరిజన యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మారేడుమిల్లి మండలం కుండాడ గ్రామానికి చెందిన కుండ్ల రాజశేఖర్‌రెడ్డి తన ఇంటి వద్ద ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీనిని గమనించిన బంధువులు వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

బరువు తక్కువ పిల్లలపై దృష్టి



హాజరైన ఐసీడీఎస్ అధికారులు



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

సాక్షి, పాడేరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో కేంద్రాలలో తక్కువ బరువు ఉన్న పిల్లలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లల బరువు పెరగకపోవడానికి గల కారణాలను విశ్లేషించి అందుకు తగ్గట్టుగా వైద్యుల సూచనల మేరకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారికి వైద్యుల పర్యవేక్షణలో పౌష్టికాహారం అందించాలని సూచించారు. ప్రతివారం కనీసం ఐదు రోజులు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించడంతోపాటు కొద్ది సమయం ఆయా గ్రామాల్లో మమేకమవ్వాలని సూపర్‌వైజర్లను ఆదేశించారు. బాలింతలకు తల్లిపాలు పట్టే విధానం, పొజిషన్ వంటి అంశాలపై చైతన్య పరచాలన్నారు. చాలా అంగన్‌వాడీ కేంద్రాల్లో కొద్దిరోజులపాటు వంటలు చేయడం లేదనే ఫిర్యాదులు తన దృష్టికి వస్తున్నాయన్నారు. దీనిపై ఐసీడీఎస్ అధికారులు పర్యవేక్షించారు. కేంద్రాల తనిఖీ, సందర్శనకు సంబంధించి సీడీపీవోలు, సూపర్‌వైజర్లు తీసిన ఫొటోలను కలెక్టర్ పరిశీలించారు. ట్రైనీ కలెక్టర్ శ్రీవాత్సవ,ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి పాల్గొన్నారు.

●సుమనోహరం





మండల కేంద్రం డుంబ్రిగుడలో ఓగిరిజనుడి ఇంటి ప్రాంగణంలో రెడ్ లిల్లీ, డెబిట్ పూలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అరుదుగా కనిపించే ఈ రకాలను ఒడిశా నుంచి తీసుకువచ్చి నాటినట్టు ఈ మొక్కలు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. – డుంబ్రిగుడ

స్తంభించిన జనజీవనం

- మన్యంలో విస్తారంగా వర్షాలు
- 116.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు



పాడేరులో కురుస్తున్న వర్షం

సాక్షి, పాడేరు: బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లాలో నాలుగు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. అక్కడక్కడ భారీ వర్షాలు కురవడంతో రెవెన్యూ యంత్రాంగాన్ని కలెక్టర్ సుమిత్‌కుమార్ అప్రమత్తం చేశారు. పాడేరు పట్టణంతో పాటు,సమీప గ్రామాల్లో కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. ఈదురుగాలులు వణికిస్తున్నాయి. జిల్లాలోని 22 మండలాల్లో 116.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని కలెక్టరేట్‌లోని వాతావరణ విభాగం అధికారులు తెలిపారు. అత్యధికంగా ఎటపాకలో 18.6 ఎంఎం, కొయ్యూరులో 14, వీఆర్‌పురంలో 10.8, కూనవరంలో 9.8, చింతూరులో 8.2, పెదబయలులో 4.6, అనంతగిరిలో 2, వై.రామవరంలో 6, హుకుంపేటలో 3, అరకులోయలో 2.4, చింతపల్లిలో 6.4, అడ్డతీగలలో 3.6, డుంబ్రిగుడలో 2.6, రంపచోడవరంలో 0.2, జి.కే.వీధిలో 2.4, గంగవరంలో 0.8, పాడేరులో 4, మారేడుమిల్లిలో 7.4, జి.మాడుగుల 4.2, రాజవొమ్మంగిలో 3.8, దేవీపట్నంలో 2 ఎంఎం వర్షపాతం నమోదైంది.

త్వరలో జర్నలిజం డిప్లమో కోర్సు

ఏపీ ప్రెస్ అకాడమి కార్యదర్శి ఎం.బాలగంగాధర్‌తిలక్



మోదకొండమ్మతల్లికి పూజలు చేస్తున్న ప్రెస్ అకాడమి కార్యదర్శి బాలగంగాధర్‌తిలక్

సాక్షి,పాడేరు: ఏపీ ప్రెస్ అకాడమి ఆధ్వర్యంలో త్వరలో జర్నలిజం డిప్లమో కోర్సు ప్రవేశపెడుతున్నామని ఏపీ ప్రెస్ అకాడమి కార్యదర్శి ఎం.బాలగంగాధర్‌తిలక్ తెలిపారు. శనివారం ఆయన పాడేరులో పర్యటించారు. ముందుగా మోదకొండమ్మతల్లి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాడేరు కలెక్టరేట్ సమావేశమందిరంలో విలేకరులతో మాట్లాడారు. ప్రెస్ అకాడమి ద్వారా పాత్రికేయులకు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేలా ఇప్పటికే అనేక అంశాల్లో శిక్షణ ఇచ్చామన్నారు. గతంలో జర్నలిస్టులకు మూడు నెలల సర్టిఫికెట్ కోర్సులు నిర్వహించామని, దానిని ఆరు నెలల డిప్లమో కోర్సుగా పొడిగించేందుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంతో అంగీకారం కుదిరిందని చెప్పారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియా అభ్యర్థులకు ఉపయోగకరంగా ఉండేందుకు సిలబస్ తయారీకి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, ఏయూ, నాగార్జున, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయాల జర్నలిస్ట్ విభాగాల అధిపతులతో కమిటీ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. జర్నలిస్టుల అక్రిడేషన్లకు సంబంధించిన నిబంధనలను కొంతమేర సడలించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. జర్నలిస్టుల ఆరోగ్య పథకంపై ప్రెస్ అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోతో చర్చించారని చెప్పారు. జర్నలిస్టులు ఆస్పత్రిలో చేరే సమయంలో ఇబ్బందులు ఉంటే ఆరోగ్య మిత్రలను సంప్రదించాలని కోరారు. హెల్ప్‌లైన్ 104కు డయల్ చేసి 4ను ప్రెస్ చేయడం ద్వారా ఆరోగ్యశ్రీ సమస్యలను కూడా జర్నలిస్టులు పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసంబంధాల అధికారి పి.గోవిందరాజులు, డివిజనల్ పౌర సంబంధాల అధికారిపి.రాములు, సహాయ సమాచార ఇంజనీర్ పి.శ్రీనివాసరావు, అకాడమి కంటెంట్ ఎడిటర్ కలమండ శరత్‌బాబు పాల్గొన్నారు.

భలే రుచి

తునికి పండ్లతో ఆదివాసీలకు ఆదాయం

చింతూరు: ఇక్కడి అటవీప్రాంతంలో లభ్యమయ్యే తునికి పండ్లకు మంచి డిమాండ్ ఉంది. సపోటా మాదిరిగానే ఎంతో రుచిగా ఉంటాయి. ఫిబ్రవరి, మార్చి నెలల్లో అడవుల్లోని తునికాకు చెట్ల నుంచి ఇవి లభిస్తాయి. పండ్లు బాగా ముగ్గిన అనంతరం రాలిపడతాయి. ఆదివాసీలు వీటిని సేకరించి పోగు రూ.20 చొప్పున విక్రయిస్తూ ఆదాయం పొందుతున్నారు.



తునికి పండ్లను విక్రయిస్తున్న వలస ఆదివాసీలు

అర్జీపై కలెక్టర్ స్పందన

సాక్షి, పాడేరు: పూర్వం నుంచి ఉన్న విద్యుత్ ప్రధాన లైన్‌ల దిగువన ఇళ్ల నిర్మాణాలు చేపట్టి ప్రమాదాల బారిన పడొద్దని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. పంచాయతీ కేంద్రం మినుములూరులో విద్యుత్ సరఫరా వైర్లతో ఇబ్బందులు పడుతున్నామని, లైన్ మార్చాలని సర్పంచ్ చిట్టమ్మ ఇటీవల స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ శనివారం ఉదయం మినుములూరును సందర్శించారు. సర్పంచ్‌కు చెందిన మిల్లు, ఇతర నివాసాలను పరిశీలించారు. విద్యుత్ లైన్ మార్పిడికి సంబంధించి నివాసితులు కూడా విద్యుత్ పంపిణీ అధికారులకు సహకరించాలని సూచించారు. విద్యుత్ పంపిణీ సంస్థ నిబంధనల మేరకు స్థానికులంతా సహకరిస్తే విద్యుత్ లైన్‌ను మార్చాలని విద్యుత్ శాఖ ఈఈ అప్పారావు, డీఈఈ భాస్కరరావు, ఏఈఈ ప్రభాకరరావులను కలెక్టర్ ఆదేశించారు.

తాటాకిల్లు దగ్ధం



కొమరాపురంలో దగ్ధం అవుతున్న తాటాకిల్లు

రాజవొమ్మంగి : కొమరాపురం గ్రామంలో శనివారం సంభవించిన అగ్నిప్రమాదంలో లోసుల రాజశేఖర్ (వలంటీర్) తాటాకిల్లు పూర్తిగా దగ్ధం అయ్యింది. విద్యుత్ వైర్ల ద్వారా మంటలు ఈ ఇంట్లోకి వ్యాపించినట్టు ప్రత్యక్షసాక్షులు తెలిపారు. వెంటనే కరెంటు ఆపేసి గ్రామస్తులు మంటలను అదుపు చేశారు. కాగా అప్పటికే రాజశేఖర్ ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఆ సమయంలో భారీ వర్షం కురుస్తున్నా స్థానికులు మంటను ఆదుపుచేయలేకపోయారు. వర్షపు నీరు, చేతి పంపు బోర్ల నుంచి నీటిని తెచ్చి మంటలు ఇతర ఇళ్లకు వ్యాప్తి చెందకుండా యువకులు అదుపు చేశారు. ఈ ప్రమాదం వల్ల రాజశేఖర్ కుటుంబం రోడ్డున పడింది.

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా చిరంజీవి

- రెండో ప్రాధాన్యత ఓటుతో విజయం
- బీజేపీ, పీడీఎఫ్‌లతో బయటపడిన టీడీపీ బంధం
- వారి ద్వారానే మెజార్టీ సాధించిన టీడీపీ అభ్యర్థి

సాక్షి, విశాఖపట్నం: మూడు శక్తులు ఏకమైనా ఏ ఒక్కరికీ పూర్తి మెజార్టీ రాలేదు. ఆ శక్తుల ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తే గాని విజయం దక్కలేదు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, పీడీఎఫ్ (వామపక్షాలు)ల మధ్య బంధాలు మరోసారి బయటపడ్డాయి. బయటకు ఏ పార్టీకి ఆ పార్టీ పోటీ చేస్తున్నట్లు కలరింగ్ ఇస్తూనే.. ఎన్నికల ప్రచారంలో మాత్రం లోపాయికారీ ఒప్పందాలకు తెరలేపారు. వీరి అప్రకటిత పొత్తులు, బంధాలు ఓట్ల లెక్కింపులో బహిర్గతమయ్యాయి. ఆ మూడు పార్టీల అక్రమ బంధాలు, పొత్తులు, రెండో ప్రాధాన్యత ఓట్లతో కలుపుకొని టీడీపీ మద్దతు ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు విజయం సాధించారు. ఆయన విజయాన్ని నిర్ధారిస్తూ శనివారం ఉదయం రిటర్నింగ్ అధికారి కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున గెలుపు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.



చిరంజీవిరావుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి మల్లికార్జున

మొదటి ప్రాధాన్య ఓట్లలో రాని మెజార్టీ

ఈ నెల 16వ తేదీన ప్రారంభమైన ఓట్ల లెక్కింపులో మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఏ ఒక్కరికీ పూర్తిస్థాయి మెజార్టీ రాలేదు. పట్టభద్రుల ఎమ్మెల్సీ విజయానికి 94,509 ఓట్లు కావాల్సి ఉంది. అయితే టీడీపీ మద్దతు అభ్యర్థికి 82,958 ఓట్లు, వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కి 55,749 ఓట్లు వచ్చాయి. దీంతో శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కించాల్సి వచ్చింది. తక్కువ ఓట్లు సాధించిన స్వతంత్ర అభ్యర్థులను ఎలిమినేట్ చేసుకుంటూ.. మొత్తం 36 రౌండ్లలో ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను లెక్కించారు. ఎలిమినేషన్ చేసిన 33 మంది ఇండిపెండెంట్ల ద్వారా 947 ఓట్లు.. బీజేపీ అభ్యర్థి మాధవ్ నుంచి 3,959 ఓట్లు, పీడీఎఫ్ అభ్యర్థి ద్వారా 6,645 ఓట్లు టీడీపీ అభ్యర్థి చిరంజీవిరావుకు రావడం గమనార్హం. బీజేపీ, పీడీఎఫ్ ద్వితీయ ప్రాధాన్యత ఓట్లతోనే టీడీపీ అభ్యర్థి విజయం సాధించారు.

బీజేపీ, పీడీఎఫ్‌లతో టీడీపీ లోపాయికారీ ఒప్పందం

టీడీపీ, బీజేపీ, పీడీఎఫ్‌ల బంధం కౌంటింగ్‌లో స్పష్టమైంది. బీజేపీ, పీడీఎఫ్‌లకు పడిన ఓట్లలో రెండో ప్రాధాన్యత ఓటు మాత్రం టీడీపీకే రావడం ఇందుకు నిదర్శనం. ఎన్నికల ప్రచారంలోనే లోపాయికారీ ఒప్పందానికి తెరలేపారు. ప్రచారంలో తొలి ప్రాధాన్యత ఓటు తమకే వేయాలని, రెండో ప్రాధాన్యత మాత్రం టీడీపీ అభ్యర్థికి వేయాలని బీజేపీ, పీడీఎఫ్ అభ్యర్థులు ప్రచారం చేశారు. ఈ విషయం బహిరంగ రహస్యమే అయినప్పటికీ.. ఆ పార్టీ నాయకులు మాత్రం ఒకరిపై ఒకరు పోటీ ఆరోపణలు చేసుకొని కలరింగ్ ఇచ్చారు. టీడీపీ అభ్యర్థి విజయానికి అవసరమైన 11,551 ఓట్లలో బీజేపీ, పీడీఎఫ్‌ల నుంచే 10,604 ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు టీడీపీ అభ్యర్థికి రావడం గమనార్హం. దీని ప్రకారం ఈ మూడు పార్టీలు కలిస్తేనే చిరంజీవిరావు విజయం సాధించగలిగారు. ఇదిలా ఉంటే బీజేపీ అభ్యర్థి, గత ఎమ్మెల్సీ మాధవ్‌కు డిపాజిట్ కూడా రాకపోవడం విశేషం.

ముంపు గ్రామాలకు బస్సు సౌకర్యం

ఆర్టీసీ ఈడీ రవికుమార్

సీలేరు: జిల్లా కేంద్రం పాడేరు నుంచి పోలవరం ముంపు గ్రామాలకు మరిన్ని బస్సు సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవికుమార్ అన్నారు. శనివారం సీలేరు వచ్చిన ఆయన శాటిలైట్ డిపో స్థలాన్ని పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జిల్లా కేంద్రం నుంచి మారుమూల ప్రాంతాలకు సైతం బస్సులు నడుపుతూ సంస్థకు మరింత లాభాన్ని చేకూర్చేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా జిల్లా విభజన తరువాత చింతూరు నుంచి తెలంగాణ సరిహద్దు ఎటపాక వరకు జిల్లా పరిధిలో ఉన్నామన్నారు. ఆ ప్రాంతంలో ముంపు గ్రామాల ప్రజలకు అక్కడ ఉద్యోగులకు పాడేరు జిల్లా కేంద్రానికి వచ్చే వీలుగా రెండు బస్సు సర్వీసులు త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే సీలేరులో శాటిలైట్ డిపో నిర్మాణానికి పనులు చేపట్టాలని కలెక్టర్ ఇప్పటికే ఆదేశించారన్నారు. ఇది పూర్తయిన వెంటనే సీలేరు నుంచి చింతూరు, చింతపల్లి ఒడిశా బస్సు సర్వీసులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ అప్పలనాయుడు, పాడేరు డీఎం నాయుడు ఉన్నారు.



సీలేరులో శాటిలైట్ డిపో స్థలాన్ని పరిశీలిస్తున్న రవికుమార్

వ్యాధులతో జీవాలు మృతి

అనంతగిరి: పినకోట పంచాయతీ పందిరిమామిడి గ్రామంలోని కొద్దిరోజులుగా వింత వ్యాధులతో పశువులు మృత్యుపడుతుండడంతో గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామానికి చెందిన చింత కన్నయ్య, సీ.భీమన్న, రామన్న, సింహాద్రి, మల్లన్న, కన్నలమ్మ, ప్రసాద్, రాజుబాబుకు, జమ్మలమ్మకు చెందిన ఐదు పశువులు, 19 మేకలు, 15 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఇప్పటికైనా పశువైద్య సిబ్బంది స్పందించి తమ గ్రామాల్లో పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

- రెట్టించిన ఉత్సాహంతో భారత్
- ఆస్ట్రేలియా సిరీస్ సమం చేసేనా?
- వరుణుడు ఆడుకుంటాడా?
- ఉత్కంఠలో క్రికెట్ అభిమానులు



విశాఖ స్పోర్ట్స్: భారత్‌లో పర్యటిస్తున్న ఆస్ట్రేలియా జట్టు సిరీస్‌లో రెండో వన్డే మ్యాచ్‌కు డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియం సిద్ధమైంది. ఇరు జట్ల ఆటగాళ్లు శనివారం విశాఖ చేరుకున్నారు. ఇదే పిచ్‌పై ఆస్ట్రేలియా జట్టును ఐదు వికెట్ల తేడాతో ఓడించిన భారత్ జట్టు మరోసారి విజయంతో పాటు సిరీస్‌ను సొంతం చేసుకునేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే వైఎస్సార్ స్టేడియంలో భారత్ జట్టు పది వన్డే మ్యాచ్‌లాడగా ఓ మ్యాచ్ రద్దయింది. ఓ మ్యాచ్‌లో ఫలితం తేలలేదు. 8 వన్డేల్లో ఓసారి వెస్టిండీస్ జట్టు విజయం సాధించగా.. భారత్ మిగిలిన ఏడు మ్యాచ్‌ల్లో విజయకేతనం ఎగురవేసింది. మొత్తానికి ఆతిథ్య జట్టుకు అచ్చొచ్చిన స్టేడియంగా మారింది. మూడున్నరేళ్ల తర్వాత ఇక్కడ వన్డే మ్యాచ్ జరుగుతుండటంతో అభిమానుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.

ఇక్కడ టాస్ కీలకం

స్టేడియంలోని సెంటర్ పిచ్‌పై ఆదివారం మ్యాచ్ జరగనుండగా పెద్దగా బౌన్స్ కాకుండా ఉండే ఈ పిచ్ స్పిన్నర్లకు అనుకూలించే అవకాశం ఉంది. జరిగిన ఎనిమిది మ్యాచ్‌ల్లోనూ మూడుసార్లు మాత్రమే లక్ష్య నిర్దేశ జట్టు విజయం సాధించగా ఐదుసార్లు లక్ష్యఛేదన జట్టే విజయం సాధించాయి. దీంతో భారత్, ఆస్ట్రేలియా జట్లకు టాస్ కీలకం కానుంది. తొలి మ్యాచ్‌లో విజయంతో భారత్ విశాఖలోనే సిరీస్ సాధించాలనే పట్టుదలతో బరిలోకి దిగుతోంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించి పట్టు నిలుపుకునేందుకు ఆస్ట్రేలియా జట్టు సిద్ధమవుతోంది.

విశాఖ చేరుకున్న భారత్-ఆస్ట్రేలియా జట్లు



గోపాలపట్నం: భారత్-ఆస్ట్రేలియా జట్ల క్రికెటర్లు శనివారం సాయంత్రం 5.30 గంటలకు విశాఖ చేరుకున్నారు. విశాఖ విమానాశ్రయం టెర్మినల్ లోపల ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్ రెడ్డి, స్వాగత కమిటీ అధ్యక్షుడు జియ్యాని శ్రీధర్ క్రికెటర్లను పుష్పగుచ్ఛాలు, గులాబీలు అందించి స్వాగతం పలికారు. నూతన ఇంటర్నేషనల్ టెర్మినల్ భవనం నుంచి క్రికెటర్లు బయటకు వచ్చారు. అప్పటికే చిరుజల్లులు కురుస్తుండటంతో.. క్రికెటర్లు వర్షంలోనే తడుస్తూ వారికి కేటాయించిన బస్సుల్లో హోటల్‌కు చేరుకున్నారు. అలాగే ఎయిర్‌పోర్టు వీఐపీ లాంజ్‌లో సునీల్ గవాస్కర్‌కు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఘన స్వాగతం పలికారు.